క్లుప్తంగా

సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి



ప్రైవేటు ఆస్పత్రిలో ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురంటౌన్: సిజేరియన్ ప్రసవాలు తగ్గించడమే ప్రభుత్వ ధ్యేయమని, దానికి అనుగుణంగా ప్రైవేటు ఆస్పత్రి, నర్సింగ్ హోం వైద్యులు సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీసుధ, బాలాజీ, వీఎస్ఆర్ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్స్, సిద్ధార్థ ఆర్థో అండ్ చిల్డ్రన్స్ క్లినిక్‌తో పాటు ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసూతిపై బుధవారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ సిబ్బంది ఆయా ఆస్పత్రుల్లో పీసీపీఎన్‌డీటీ, స్కాన్ రిపోర్టులతో పాటు వివిధ రిపోర్టులను పరిశీలించారు.

లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం సమీపంలో బుధవారం విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా లైన్‌మెన్ రామచంద్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్తంభం నుంచి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని హిందూపురం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

లేపాక్షి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలని ఎంపీడీఓ నరసింహమూర్తికి బుధవారం సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. గత 12 వారాలుగా ఉపాధి బిల్లులు అందలేదని, ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలకు మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివప్ప, నారాయణ రెడ్డి, గౌతమ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

తోటకు నిప్పు - రూ.5 లక్షల నష్టం



దగ్ధమవుతున్న షెడ్డు, తోట

సోమందేపల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో సర్పంచ్ జిలాన్ అతని సోదరుడు జబీకి చెందిన తోటకు దుండగులు బుధవారం నిప్పు పెట్టారు. 8 ఎకరాల్లో మామిడి, జామ, కొబ్బరి చెట్లను సాగు చేస్తున్నారు. చెట్లతో పాటు షెడ్‌లో ఉంచిన డ్రిప్ పరికరాలు కూడా దగ్ధం కావడంతో సుమారు రూ.5 లక్షలు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

'సేంద్రియం'తో అధిక దిగుబడి



మాట్లాడుతున్న బబ్లూ గంగూలి

రొద్దం: వ్యవసాయంపై ఆధారపడిన ప్రతి రైతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బబ్లూ గంగూలి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అనంతశక్తి సొసైటీ కార్యాలయ ఆవరణంలో రొద్దం, చెన్నేకొత్తపల్లి, రామగిరి, మండలాల జన చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయలసీమ ప్రాజెక్ట్ ఉమ్మడి మండల లీడర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బబ్లూ గంగోలి, టింబక్టు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య మాట్లాడారు. నీటి యాజమాన్య పద్ధతులు, నీటి వాడక విధానం, నీటి వనరుల నిర్వాహనపై అవగాహన కల్పించారు. సేంద్రియంతో లాభాలు పొందవచ్చాన్నారు.

సజావుగా పది పరీక్షలు

అమరాపురం: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. హిందీ పరీక్షకు మొత్తం మూడు పరీక్ష కేంద్రాల నుంచి 621 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ రాఘవయ్య తెలిపారు.

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆవినకుంట కేజీబీవీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్ష సజావుగా జరిగింది. రెండు సెంటర్లలో ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

అద్దె భవనాల్లో అంగన్వాడీలు

చాలా గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేని అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మడకశిర నియోజకవర్గ పరిధిలో 116 అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి.

అంగన్వాడీ కేంద్రాలు ఇలా..

మడకశిర ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేంద్రాలు	269
అద్దె భవనాల్లో ఉన్నవి	66
గుడిబండ ప్రాజెక్టు పరిధిలో ఉన్న కేంద్రాలు	169
అద్దె భవనాల్లో ఉన్నవి	50

అమరాపురంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం




- అరకొర సౌకర్యాలతో చిన్నారులు, గర్భిణుల అవస్థలు
- మడకశిర నియోజకవర్గంలో 116 కేంద్రాలకు భవనాలు కరువు
- ప్రభుత్వం చొరవ చూపాలంటున్న ప్రజలు

అమరాపురం: మడకశిర నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనం లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. మడకశిర నియోజకవర్గంలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. మడకశిర ప్రాజెక్టు పరిధిలో మడకశిర, రొళ్ల, అగళి ఉండగా.. గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గుడిబండ, అమరాపురం మండలాలు ఉన్నాయి. ఇందులో అమరాపురం, గుడిబండ మండలాల్లో మొత్తం 169 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే ఇందులో 50 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే మడకశిర, అగళి, రొళ్ల మండలాల్లో 269 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 66 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

ఒక్క భవనాన్నీ మంజూరు చేయని ప్రభుత్వం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్వాడీలకు ఒక్క కొత్త భవనాన్ని కూడా మంజూరు చేయలేదు. సంబంధిత ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి కొత్త భవనాలు మంజూరు చేసి వాటిని నిర్మిస్తే ప్రీ స్కూల్ పిల్లలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంతో మేలు చేకూరుతుంది. ఆ దిశగా అడుగులు వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



తమ్మడేపల్లిలో అర్ధంతరంగా ఆగిన భవనం

అన్నింటికీ ఇబ్బందే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో కొన్నింటికి అంగన్‌వాడీ భవనాలు మంజూరు కాగా ప్రస్తుతం అవి కూడా అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని లబ్ధిదారులు వాపోతున్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంతో సరుకులు నిల్వ ఉంచడానికి, వంట చేయడానికి, పిల్లలకు చదువు చెప్పడానికి ఇలా మూడు గదులు కావాలి, అయితే గ్రామాల్లో అలాంటి అద్దె భవనాలు దొరకడం లేదు. దీంతో ఇబ్బందులు వస్తున్నాయి.

భవనాన్ని పూర్తి చేయాలి



మా గ్రామంలో నాలుగు సంవత్సరాల క్రితం మంజూరు చేసిన అంగన్‌వాడీ భవనం అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో అద్దె భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం నడుస్తోంది. ఈ భవనాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలి.
– అంబిక, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

సొంత భవనాలు నిర్మించాలి



మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, గుడిబండ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 116 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ భవనాల స్థానంలో పక్కా భవనాలను మంజూరు చేసి అందుబాటులోకి తీసుకురావాలి. అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. – నారాయణ, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు అమరాపురం

జగన్‌ను కలసిన నాయకులు

మడకశిరరూరల్: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని మరింతగా బలోపేతం చేసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వివిధ ప్రధాన సమస్యలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారన్నారు.

రొళ్ల: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని అన్ని విధాలుగా బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు

అగళి: మండల పరిధిలోని హళ్లికెర సర్పంచ్ ముద్దరాజు బుధవారం విజయవాడలోని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తనతో పాటు పలువురు నాయకులు జగనన్నను కలసి నియోజకవర్గ పరిస్థితులను వివరించామన్నారు.

చిలమత్తూరు: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మండల పరిధిలోని శెట్టిపల్లి ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి కలిశారు. మండలంలో టీడీపీ నేతలు చేస్తున్న అరాచకాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.



వైఎస్ జగన్‌ను కలిసిన రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు

పరిగి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో మండలంలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటూ కార్యకర్తలు, నాయకులు కలిశారు. జగన్‌ను కలిసిన వారిలో ఎంపీటీసీలు మారుతీరెడ్డి, అమరావతి, ఊటుకూరు సర్పంచ్ దిలీప్, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, బాలు, సింగారెడ్డి, రఫీక్, సోము, ప్రేమ్‌సాయి తదితరులు ఉన్నారు.

కూరగాయలు పంపిణీ చేసిన న్యాయమూర్తి



కూరగాయలు అందిస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి శైలజ

హిందూపురం అర్బన్: పట్టణంలోని పలు ముస్లిం కుటుంబీకులకు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ బుధవారం కూరగాయలు పంపిణీ చేశారు. తన సొంత డబ్బుతో కూరగాయలు అందించడంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. 60 కుటుంబాలకు పైగా కూరగాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది సుదర్శన్, సీనియర్ న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, మురళి, లోక్ అదాలత్ సిబ్బంది శారద, శివ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చలివేంద్రం ప్రారంభం

పరిగి: స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గేటు ముందు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఎస్‌ఎల్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు చంద్ర, నరసింహమూర్తి పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

అగళి: ఐపీఎల్ క్రికెట్ పోటీల నేపథ్యంలో యువకులు బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వీరేష్ ఒక ప్రకటనలో సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత బెట్టింగ్‌లకు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

చెరువులను కృష్ణాజలాలతో నింపండి

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు నింపి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం నాయకులతో కలిసి మండలంలోని కొండంపల్లి వద్ద హంద్రీనీవా కాలువ, పంపు హౌస్‌ను పరిశీలించారు. కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్లు రుణాల మాఫీ చేసే ప్రభుత్వాలు రైతులకు ఉపయోగపడే మడకశిర బ్రాంచ్ కెనాల్ పూర్తికి వందల కోట్లు ఖర్చు పెట్టితే చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కమిటీ సభ్యులు సోమ్‌కుమార్, వేమారెడ్డి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళాలు

లేపాక్షి: లేపాక్షి పంచాయతీ కార్యాలయం ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశులు, సిబ్బంది రూ. 20 వేల విరాళాన్ని అందించారు. బుధవారం ఆ మొత్తాన్ని ప్రెస్‌క్లబ్ సభ్యులకు అందజేశారు. అలాగే మండలంలో చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది రూ. 10 వేలు విరాళం అందించారు.

సమస్యలపై దృష్టి సారించండి

చిలమత్తూరు: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావును సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనల మేరకు ఒకరోజు గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, కోడూరు సమీపంలో చిత్రావతి నదిపై నిర్మించిన అక్రమ వంతెనను తొలగించాలని, ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

డ్యూటీ చార్ట్ కౌన్సెలింగ్ బహిష్కరణ

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపో పరిధిలో బుధవారం ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో పలువురు ఆర్టీసీ కార్మికులు డ్యూటీ చార్ట్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. ఇటీవలనే డిపో సమస్యలపై ఎన్‌ఎంయూ నాయకులు డీఎంకు వినతిపత్రం సమర్పించిన విషయం తెలిసిందే. అయితే ఇంత వరకూ సమస్యలపై చర్చించడానికి డీఎం చర్చలకు పిలవలేదు. కండక్టర్ నారాయణ సస్పెన్షన్‌ను కూడా ఎత్తివేయలేదు. దీనికి నిరసనగా ఎన్‌ఎంయూ నాయకులు డ్యూటీ చార్ట్ కౌన్సెలింగ్ ప్రక్రియను బహిష్కరించారు. డీఎం రామసుబ్బయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. నాయకులు రామకృష్ణ, పురుషోత్తం, నాయక్, ముద్దప్ప, బ్రహ్మానందారెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని చితకబాదిన వ్యక్తిపై చర్యలు తీసుకోరా?

రొద్దం: తన కుమారుడిని చితక బాదిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు సతీష్ ఆరోపించారు. ఆయన వివరాల మేరకు... మండల పరిధిలోని కందుకూర్లపల్లికి చెందిన వడ్డె సునీత, సతీష్ కుమారుడు సుగుణాకర్ (8)ను అదే గ్రామానికి చెందిన వడ్డె శివ చితకబాదాడన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసి ఐదు రోజులు గడుస్తున్నా వడ్డె శివపై పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ కాంతప్ప మాట్లాడుతూ తమకు ఫిర్యాదు అందిందని, శివ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

రొద్దం: మండల పరిధిలోని చోళేమర్రి గ్రామంలో అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో సీఈఓ లావణ్య, సొసైటీ అధ్యక్షురాలు సుశీలమ్మ సమక్షంలో బుధవారం మహిళా చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్ష, హింసపై నాటిక రూపంలో అవగాహన కల్పించారు. మహిళలకు గృహహింస, బాల్య వివాహాలు, సమానత్వం, నిర్ణయాధికారం తదితర అనేక అంశాలపై నాటిక ప్రదర్శించారు.

కరుణించు కెంచమాంబదేవి



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరు లో వెలసిన కుంచిటి వక్కలిగుల సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన కుల దేవత కెంచమాంబదేవి మండల పూజను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ రకాల అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు.అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



అలంకరణలో కెంచమాంబదేవి

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ రిపేరీ , కమ్యూనికేషన్ స్కిల్స్ , కంప్యూటర్ బేసిక్ నాలెడ్జ్ కోర్సులు ఉచితంగా ప్రారంభిస్తున్నట్లు పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అంతకన్నా ఎక్కువ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఆధార్ జిరాక్స్‌తో పాటు ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నంబర్ కలిగి ఉండాలని, కోర్సు నాలుగు నెలలు ఉంటుందన్నారు. శిక్షణ పొందే వారికి సర్టిఫికేట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు, బ్యాంక్ లోన్ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాయి గణేష్ ఫోన్ నంబర్ 9966682246ను సంప్రదించాలన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ రూరల్: రూడ్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మహిళలు మాత్రమే శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ సమయంలో భోజన , వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.18 ఏళ్ల పైబడి 45 ఏళ్లలోపు మహిళలు రేషన్, ఆధార్ కార్డుతో పాటు సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9618876060 నంబర్‌ను సంప్రదించాలని మండల పరిషత్ కార్యాలయం ఏఓ భాగ్యరేఖ తెలిపారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	36.0
పెనుకొండ	39.0
మడకశిర	36.0

చికిత్స పొందుతూ యువతి మృతి

అగళి: మండల పరిధిలోని జంగమరపల్లికి చెందిన రమేష్ ,వన్నమ్మల చిన్న కుమార్తె అమూల్య (17) బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. అమూల్య పదో తరగతి వరకూ చదువుకుని ఇంటిలోనే ఉంటూ గొర్రెలు మేపుతూ ఉండేది. అయితే జీవితంపై విరక్తి చెంది ఫిబ్రవరి 25న నిప్పంటించుకొని ఆత్మహత్యకు యత్నించింది. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించడంతో బుధవారం చనిపోయినట్లు ఎస్‌ఐ వీరేష్ తెలిపారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

హిందూపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హిందూపురం అసెంబ్లీ నియోకవర్గం ఎన్నికల నమోదు అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం 2 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు హిందూపురం తహసీల్దార్ వెంకటేశులు ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే సమావేశానికి రావాలన్నారు. హిందూపురంలో ఓటర్ల నమోదు కార్యక్రమంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు



హిందూపురం: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఉపాధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన కొటిపి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈనెల 16న అనంతపురం జిల్లా కసాపురంలో రాష్ట్రస్థాయి సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తన ఎంపిక చేశారని, బ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఎర్ర బస్సు వచ్చిందోచ్..



బస్సు వద్ద సంబరాలు జరుపుకుంటున్న ప్రజలు

పావగడ: మొట్ట మొదటిసారిగా చిక్కనాయకనహళ్లి మాది మళ్లి గ్రామానికి బుధవారం కేఎస్ఆర్టీసీ బస్సు రావడంతో ఆ గ్రామస్తుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పావగడ పూజారప్ప మాట్లాడుతూ రైతు సంఘాలు, గ్రామ ప్రజల అలుపెరగని పోరాటాలతోనే ఆర్టీసీ బస్సు మాదీ హళ్లి గ్రామానికి వచ్చిందన్నారు. విద్యార్థులు, ప్రజలకు ఇప్పుడు ఏ ఇబ్బందీ ఉండదన్నారు..

ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పెద్దమంతూరు ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఫైరోజ్ బేగం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది పనితీరుపై స్థానిక డాక్టర్ సోమశేఖర్‌రెడ్డితో ఆరాతీశారు. అక్కడే ఉన్న రోగులతో ఆస్పత్రి సిబ్బంది అందించే వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఫార్మా గదిని, అందులో ఉన్న ఐఎల్‌ఆర్ పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం నిర్మాణ దశలో ఆగిపోయిన 20 పడకల భవనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ భాగ్యలక్ష్మి, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ గిరినాథ్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణను చూసి కళ్లు తెరవండి

పావగడ: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎబీసీడీ వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ఆ ప్రభుత్వాన్ని చూసైనా కర్ణాటక ప్రభుత్వం కళ్లు తెరవాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కృష్ణ మాదిగకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు పేటె రమేశ్ , నరసప్ప, నాగేశ్, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.